సాక్షి
అనంతపురం
శనివారం। 25। నవంబర్। 2023



చీనీ టన్ను రూ.27 వేలు
అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో శుక్రవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.27 వేలు పలికాయి.



టమాట కిలో రూ.22
కక్కలపల్లి మండీలో శుక్రవారం కిలో టమాట గరిష్ట ధర రూ.22 పలికింది. కనిష్టం రూ.10, సరాసరి రూ.15 ప్రకారం క్రయ విక్రయాలు సాగాయి.

గరిష్టం/కనిష్టం
33.5°/ 21.7°

జిల్లా అంతటా శుక్రవారం పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఆకాశం మేఘావృతమై అక్కడక్కడా తేలికపాటి వర్షం కురిసింది. ఉదయం చలి కొనసాగింది.

న్యూస్‌రీల్

ఎస్కేయూ ఇన్‌చార్జ్ వీసీగా చింతా సుధాకర్



అనంతపురం: శ్రీకృష్ణదేవ రాయ విశ్వవిద్యాలయం ఇన్‌చార్జ్ వీసీగా ప్రొఫెసర్ చింతా సుధాకర్ నియమితులయ్యారు. ఈ మేరకు ఉన్నత విద్య ప్రిన్సిపల్ సెక్రెటరీ జె.శ్యామలారావు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఎస్కేయూ వీసీ ప్రొఫెసర్ మాచిరెడ్డి రామకృష్ణారెడ్డి పదవీ కాలం శుక్రవారంతో ముగియడంతో ఇన్‌చార్జ్ వీసీని నియమించారు. చింతా సుధాకర్ ప్రస్తుతం యోగి వేమన యూనివర్సిటీ వీసీగా ఉన్నారు. ఎస్కేయూ పూర్వ విద్యార్థి, మాజీ బోటనీ ప్రొఫెసర్ అయిన చింతా సుధాకర్‌కు 34 ఏళ్ల బోధన, 37 ఏళ్ల పరిశోధనానుభవం ఉంది. ఎమ్మెస్సీ (బోటనీ), పీహెచ్‌డీ ఎస్కేయూలోనే పూర్తి చేశారు. 1987లో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా ఎస్కేయూలో చేరారు. ఎస్కేయూలోనే చదివి, ఇక్కడే ప్రొఫెసర్‌గా పనిచేసి తాజాగా అత్యున్నత హోదా అయిన ఇన్‌చార్జ్ వీసీగా వస్తున్నారు. శనివారం ఆయన బాధ్యతలు స్వీకరించనున్నారు. ఈ సందర్భంగా పలువురు ఆయనకు అభినందనలు తెలిపారు.

తుంగభద్రకు పెరుగుతున్న ఇన్‌ఫ్లో



బొమ్మనహాళ్: టీబీ డ్యాంకు ఇన్‌ఫ్లో స్వల్పంగా పెరుగుతోంది. సోమవారం 78 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా.. మూడు రోజుల్లో కొంతమేర పెరిగింది. అది శుక్రవారం ఇన్‌ఫ్లో 556 క్యూసెక్కులు, అవుట్‌ఫ్లో 10,741 క్యూసెక్కులుగా నమోదైంది. ప్రస్తుతం డ్యాం నీటి మట్టం 1596.85 అడుగులతో 17.722 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ఆంధ్రా సరిహద్దులోని 105వ కిలోమీటర్ వద్ద హెచ్చెల్సీలో 1,790 క్యూసెక్కుల నీరు ప్రవహిస్తోంది.

ఘనంగా తులసీ ధాత్రీ కల్యాణం



తులసీ ధాత్రీ కల్యాణాన్ని నిర్వహిస్తున్న దృశ్యం

గుంతకల్లు రూరల్: క్షీరాబ్ధి ద్వాదశి సందర్భంగా ప్రముఖ పుణ్యక్షేత్రం కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి దేవస్థానంలో తులసీ ధాత్రీ కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. శుక్రవారం సాయంత్రం ఆలయ ముఖ మండపంలో సీతారాముల ఉత్సవ విగ్రహాలను కొలువుదీర్చి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం తులసీ ధాత్రీ కల్యాణాన్ని జరిపించారు. ఈఓ పట్టెం గురుప్రసాద్, సిబ్బంది, పాలక మండలి సభ్యులు పాల్గొన్నారు.

ఫార్మా డీ ఫలితాల విడుదల

అనంతపురం: జేఎన్‌టీయూ అనంతపురం పరిధిలో సెప్టెంబర్, అక్టోబర్ , నవంబర్ నెలల్లో నిర్వహించిన ఫార్మా డీ ఫలితాలను విడుదల చేసినట్లు డైరెక్టర్ ఆఫ్ ఎవాల్యుయేషన్స్ ఈ.కేశవరెడ్డి, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ చంద్రమోహన్‌రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. ఫార్మా డీ. రెండో సంవత్సరం (ఆర్‌–17) , రెగ్యులర్ , సప్లిమెంటరీ, ఫార్మా డీ. రెండో సంవత్సరం (ఆర్‌–14) సప్లిమెంటరీ, ఫార్మా. డీ (పీబీ) రెండో సంవత్సరం (ఆర్‌–17) రెగ్యులర్, సప్లిమెంటరీ , బీ ఫార్మసీ ఒకటో సంవత్సరం రెండో సెమిస్టర్ (ఆర్‌–19) రెగ్యులర్, సప్లిమెంటరీ, ప్రీపీహెచ్‌డీ (ఆర్‌–9), (ఆర్‌–18) సమ్మర్ సెషన్ పరీక్ష ఫలితాలను విడుదల చేశామన్నారు. పరీక్ష ఫలితాలు జేఎన్‌టీయూ(ఏ) వెబ్‌సైట్‌లో ఉంచామన్నారు.

నైపుణ్యాలు మెరుగుపర్చుకోండి



టీచింగ్‌ను పరిశీలిస్తున్న రాష్ట్ర పరిశీలకుడు

గార్లదిన్నె: ఉపాధ్యాయులు బోధన నైపుణ్యాలు మెరుగు పరుచుకోవాలని తరగతి బోధన రాష్ట్ర పరిశీలకుడు అబ్రహాం లింకన్ పేర్కొన్నారు. శుక్రవారం మండల పరిధిలోని ఎంపీపీఎస్ మర్తాడు మెయిన్, పెనకచెర్ల మెయిన్, కొప్పలకొండ పాఠశాలల్లో తరగతి గదిలో ఉపాధ్యాయుల ప్రవర్తన, బోధించే విధానాలను ఆయన పరిశీలించారు. బోధనా విధానం బాగా ఉందని, కొంత మంది ఉపాధ్యాయులు బోధన నైపుణ్యాలను మెరుగుపరుచుకోవాని సూచించారు. ప్రతి రెండు నెలలకు ఒకసారి తరగతి గదిలో బోధనా విధానాన్ని పరిశీలించి, వారు ఏయే ప్రవర్తనల్లో, ఏ స్థాయిలో ఉన్నారో వారి స్థాయిలను గుర్తించి తక్కువ నైపుణ్య స్థాయి ఉన్నవారికి ట్రైనింగ్ ఇవ్వాలన్నారు.

- పేట్రేగిపోతున్న జేసీ సోదరులు
- తాడిపత్రిలో టెన్షన్ వాతావ'రణం'
- ఎన్నికల వేళ పల్లెల్లో వివాదాలకు ఆజ్యం
- అభివృద్ధి పనులకు అడుగడుగునా ఆటంకం
- కాంట్రాక్టర్లకు తీవ్రస్థాయిలో బెదిరింపులు.. హుకుం
- నిత్య గొడవలతో బెంబేలెత్తిపోతున్న సామాన్య జనం
- పోలీసుల ప్రేక్షకపాత్ర.. ప్రభాకర్‌రెడ్డిపై చర్యలకు వెనకడుగు

రాజకీయాల్లో వివాదాలకు కేంద్రబిందువైన జేసీ బ్రదర్స్ (మాజీ ఎంపీ జేసీ దివాకర్‌రెడ్డి – మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి) టీడీపీ అధికారం లేకపోయేసరికి సహనం కోల్పోతున్నారు. ప్రతిపక్షంలో హుందాతనం కనబరచాల్సిన వీరు తద్భిన్నంగా వ్యవహరిస్తున్నారు. దిగజారుడు రాజకీయాలతో విమర్శలు మూటగట్టుకుంటున్నారు. తాడిపత్రి నియోజకవర్గంలో అరాచకాలకు పాల్పడుతూ ప్రజలను బెంబేలెత్తిస్తున్నారు.



అసహనంతో అరాచకం

సాక్షి ప్రతినిధి, అనంతపురం: తాడిపత్రిలో 30 ఏళ్లకు పైగా అధికారంలో ఉండి దొరతనాన్ని వెలగబెట్టిన జేసీ సోదరులు ప్రతిపక్షంలోకి వచ్చాక ఉనికి కోసం పడరానిపాట్లు పడుతున్నారు. వీరు నిత్యం ఏదో ఒక వివాదంతో నియోజకవర్గంలో హైటెన్షన్ వాతావరణం సృష్టిస్తున్నట్టు విమర్శలొస్తున్నాయి. గత కొన్ని రోజులుగా జేసీ ప్రభాకర్‌రెడ్డి చేష్టలకు సామాన్యులకే కాదు పోలీసులకు సైతం కంటిమీద కునుకులేకుండా ఉంది. ఇప్పటికే పలు అవినీతి కేసుల్లో ఉన్న ప్రభాకర్‌రెడ్డి ఎన్నికలు సమీపిస్తున్న సమయంలో మరింతగా పేట్రేగిపోతున్నట్టు సొంత పార్టీ నేతలే చెబుతున్నారు.

అభివృద్ధి పనులను అడ్డుకుంటూ..

వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక తాడిపత్రి నియోజకవర్గంలో పలు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. వీటినెలాగైనా అడ్డుకోవాలనేది జేసీ ప్రభాకర్‌రెడ్డి ఆలోచన. ఇందులో భాగంగా ఆస్పత్రి నిర్మాణాలను అడ్డుకోవాలని కాంట్రాక్టర్‌ను బెదిరించారు. దీంతో ఈ నెల 23వ తేదీ వివాదం రాజుకుంది. జేసీ బెదిరింపులకు భయపడి కాంట్రాక్టర్ పనులు ఆపేసి వెళ్లినట్టు తెలిసింది. దీంతో ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి ఫిర్యాదు చేసేందుకు స్టేషన్‌కు ర్యాలీగా వెళ్లడంతో పోలీసులు అడ్డుకున్నారు.

ఇది తొలిసారి కాదు...

జేసీ ప్రభాకర్‌రెడ్డి ప్రభుత్వాస్పత్రి పనులను అడ్డుకోవడం మొదటి సారేమీ కాదు. మొన్నటికి మొన్న డ్రెయినేజీ పనులను అడ్డుకున్నారు. ఏకంగా మురికి కాలువలో కుర్చీ వేసుకుని కూర్చుని వివాదం రేపారు. అంతకుముందు 'నాడు–నేడు' పనుల కింద జూనియర్ కాలేజీకి ప్రహరీ నిర్మిస్తుంటే అడ్డుకున్నారు. అనుచరులతో కలిసి గొడవకు దిగారు. చివరకు పోలీసుల రక్షణలో ప్రహరీ పనులు చేపట్టాల్సి వచ్చింది. ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌ను ఏర్పాటు చేసినా అడ్డుకుని రాద్ధాంతం చేశారు. చావుతప్పి కన్ను లొట్ట పోయిన చందంగా మున్సిపల్ చైర్మన్‌గా ఎన్నికై... వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి చెడ్డపేరు తెచ్చేందుకు మున్సిపాలిటీలో అన్ని పనులకూ అడ్డు తగులుతున్నారు.

అనుచరులను ఉసిగొలుపుతూ...

గత ఎన్నికల్లో ఎమ్మెల్యేగా గెలవలేకపోయేసరికి జేసీ ప్రభాకర్‌రెడ్డి తీవ్ర అక్కసుతో ఉన్నారు. తన అనుచరులతో కలిసి ఏదో ఒక వివాదాన్ని సృష్టించడం, ధర్నాలు, నిరసనలు చేపట్టడం, సామాన్యులను భయభ్రాంతులకు గురి చేయడం.. ఇదీ తాడిపత్రిలో రోజువారీ తీరు. గత నాలుగేళ్లుగా ప్రశాంతంగా ఉన్న తాడిపత్రిలో మళ్లీ పల్లెలకు వెళ్లి వివాదాలకు ఆజ్యం పోస్తున్నారు. ఇదిలా ఉండగా జేసీ ప్రభాకర్ చేష్టలతో విసిగిపోయిన తెలుగుదేశం పార్టీ నేతలు ఎవ్వరూ ఈయనకు అండగా నిలవని పరిస్థితి. జేసీ సోదరులు టీడీపీకి గుదిబండగా మారారని అనంతపురానికి చెందిన ఆ పార్టీ నాయకుడొకరు చెప్పారు. వీరిని పార్టీ నుంచి సస్పెండ్ చేస్తే తప్ప తాడిపత్రిలో టీడీపీకి మనుగడ లేదంటున్నారు.

జేసీ తీరుపై పోలీసుల మౌనం

జేసీ ప్రభాకర్‌రెడ్డి అనుచరురాలు కమలమ్మ ఫిర్యాదుపై స్పందించి కేసు నమోదు చేసిన పోలీసులు.. జేసీ అనుచరుల ఆగడాలపై మాత్రం కనీస స్పందన లేదు. ఇన్ని వివాదాలు సృష్టిస్తున్నా సుమోటోగా కేసు నమోదు చేయలేదు. జేసీ బెదిరింపులను, వివాదాలను కనీసం పరిగణనలోకి తీసుకోవడం లేదన్న విమర్శలున్నాయి. పోలీసులు ఎందుకు భయపడుతున్నారని సామాన్యులు ప్రశ్నిస్తున్నారు.

కేసు నమోదుకు ఆదేశం

కాంట్రాక్టర్లను బెదిరించిన తీరుపై బాధితుల నుంచి ఫిర్యాదు తీసుకుని కేసు నమోదు చేయాలని తాడిపత్రి పోలీసులను ఆదేశించాం. ఎవరినైనా బెదిరించినా, ప్రభుత్వ కార్యకలాపాలకు అడ్డు తగిలినా తీవ్రంగా పరిగణిస్తాం. శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే ఎంతటివారినైనా వదిలే ప్రసక్తే లేదు.

– అన్బురాజన్, ఎస్పీ

బెదిరింపు కేసులో ఇద్దరి అరెస్ట్

- పిస్టల్, బుల్లెట్లు స్వాధీనం



పిస్టల్ చూపుతున్న ఎస్పీ అన్బురాజన్

అనంతపురం క్రైం: పిస్టల్‌తో బెదిరించి డబ్బు వసూలు చేసిన కేసులో ఇద్దరు నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. వీరి నుంచి ఒక పిస్టల్, బుల్లెట్లు స్వాధీనం చేసుకున్నారు. ఇందుకు సంబంధించిన వివరాలను ఎస్పీ అన్బురాజన్ శుక్రవారం పోలీసు కాన్ఫరెన్స్ హాలులో మీడియాకు వెల్లడించారు. నంద్యాల జిల్లా ప్యాపిలికి చెందిన తొండపాటి సుధాకర్‌కు గుత్తి మండలం తురకపల్లికి చెందిన జయకృష్ణారెడ్డి, ఎర్రగుడికి చెందిన బొల్లినేని ప్రశాంత్ నాయుడు అలియాస్ ప్రశాంత్‌తో ఆర్థిక లావాదేవీలు ఉన్నాయి. ఈ నెల ఒకటో తేదీన గుత్తి బాటలో సుంకులమ్మ ఆలయం సమీపంలో ఉన్న సుధాకర్ వద్దకు కృష్ణారెడ్డి, ప్రశాంత్‌నాయుడు ద్విచక్ర వాహనంపై వచ్చి తుపాకీతో బెదిరించారు. అతని వద్దనున్న రూ.11,500 నగదు లాక్కొనిపోయారు. అనంతరం సుధాకర్‌కు ప్రశాంత్‌నాయుడు ఫోన్ చేసి మిగతా డబ్బు కూడా ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేకపోతే పిస్టల్‌తో కాల్చి చంపుతామని బెదిరించారు. దీంతో సుధాకర్ భయపడి నవంబరు 22న గుత్తి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు నిందితుల కోసం గాలింపు చర్యలు చేపట్టారు. సీఐ వెంకటరామిరెడ్డికి అందిన సమాచారం మేరకు శుక్రవారం గుత్తి మండలం కరిడికొండ వద్ద జాతీయరహదారిపై కాపుకాచి కర్నూలు వైపు వెళ్తున్న ప్రశాంత్‌నాయుడు, తోగుట్ల రామ్మోహన్‌రెడ్డి అలియాస్ రామిరెడ్డిను అరెస్టు చేశారు. వీరి నుంచి ఒక పిస్టల్, రెండు మ్యాగజీన్, ఐదు బుల్లెట్లు స్వాధీనం చేసుకున్నారు. మరొక నిందితుడు జయకృష్ణారెడ్డి పరారీలో ఉన్నట్లు ఎస్పీ తెలిపారు.

మందకొడిగా 'రబీ'

- 1.21 లక్షల హెక్టార్లకు గానూ 35 వేల హెక్టార్లలో సాగు



అనంతపురం అగ్రికల్చర్: వర్షాభావ పరిస్థితుల కారణంగా రబీ మందకొడిగా 'సాగు'తోంది. అక్టోబర్, నవంబర్ నెలల్లో 130 మి.మీకు గాను 50 మి.మీ వర్షపాతం నమోదైంది. దీంతో అక్కడక్కడా మాత్రమే పంటలు సాగు చేశారు. ఈ రబీలో 1.21 లక్షల హెక్టార్ల విస్తీర్ణంలో పంటలు సాగులోకి వస్తాయని అంచనా వేయగా.. ప్రస్తుతానికి 35 వేల హెక్టార్లలో సాగయ్యాయి. అందులో ప్రధానపంట పప్పుశనగ 78 వేల హెక్టార్లకు గాను 28 వేల హెక్టార్లలో వేశారు. పప్పుశనగ సాగుకు సమయం ఇప్పటికే ముగిసిపోయింది. ప్రస్తుతం నీటి వనరుల కింద వేరుశనగ సాగు చేస్తున్నారు. వేరుశనగ కూడా 20 వేల హెక్టార్లు అంచనా వేయగా ప్రస్తుతానికి 2 వేల హెక్టార్లలో వేశారు. ఈ సీజన్‌లో వరి 7,700 హెక్టార్లు అంచనా వేసినప్పటికీ వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో వరి స్థానంలో వేరుశనగ, చిరుధాన్యాలు, ఇతరత్రా ఆరుతడి పంటలు వేసుకోవాలని రైతులకు జిల్లా యంత్రాంగం విజ్ఞప్తి చేస్తోంది. మిగతా జొన్న, మొక్కజొన్న, రాగి, సజ్జ, కొర్ర, ఉలవ, పెసర, అలసంద, పొద్దుతిరుగుడు తదితర అన్ని పంటలు నామమాత్రంగా సాగయ్యాయి.

వచ్చే వారంలో కేంద్ర బృందం పర్యటన

ఈ ఏడాది ఖరీఫ్, రబీలో సాధారణం కన్నా 40 శాతం మేర లోటు వర్షపాతం నమోదు కావడంతో అనుకున్న దానికన్నా తక్కువగా పంటలు వేశారు. జిల్లాలో 28 మండలాలను ప్రభుత్వం కరువు మండలాలుగా ప్రకటించింది. ఈ నేపథ్యంలో కరువు పరిస్థితుల పరిశీలనకు వచ్చే వారం కేంద్ర బృందం జిల్లా పర్యటనకు రానున్నట్లు అధికారులు చెబుతున్నారు. వైఎస్సార్ ఉచిత పంటల బీమాతో సంబంధం లేకుండా వర్షాభావం వల్ల జరిగిన నష్టానికి రైతులకు గరిష్టంగా రెండు హెక్టార్లకు పెట్టుబడిరాయితీ (ఇన్‌పుట్‌సబ్సిడీ) ఇవ్వడానికి జిల్లా యంత్రాంగం రాష్ట్ర ప్రభుత్వానికి ఈ నెలాఖరున ప్రతిపాదనలు పంపడానికి ఏర్పాట్లు చేస్తోంది.

డిజిటల్ చెల్లింపులతో డ్రిప్ పంపిణీ



మాట్లాడుతున్న ఏపీఎంఐపీ పీడీ జి.ఫిరోజ్‌ఖాన్

అనంతపురం అగ్రికల్చర్: ప్రభుత్వం రాయితీతో అందిస్తున్న డ్రిప్, స్ప్రింక్లర్ల కోసం రైతులు తమ వాటా సొమ్మును తప్పనిసరిగా డిజిటల్ విధానంలో చెల్లించాలని ఏపీఎంఐపీ పీడీ జి.ఫిరోజ్‌ఖాన్ ఆదేశించారు. శుక్రవారం నగరంలోని ప్రాంతీయ ఉద్యాన శిక్షణ కేంద్రంలో డ్రిప్ కంపెనీ డీసీఓలు, ఎంఐ ఇంజినీర్లు, ఎంఐఏఓలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ ఏడాది జిల్లాకు ఇచ్చిన 12,500 హెక్టార్లు లక్ష్యాన్ని జనవరిలోపే వంద శాతం పూర్తి చేయడానికి వారం ప్రణాళిక (వీక్లీ ప్లాన్) అమలు చేయనున్నట్లు తెలిపారు. ఇప్పటికే 10 వేల హెక్టార్లకు మంజూరు చేశామన్నారు. రైతులు తమ వాటా చెల్లింపు క్రమంలో కంపెనీ ప్రతినిధులు, క్షేత్రస్థాయి సిబ్బందికి నగదు ఇస్తున్నట్లు తమ దృష్టికి రావడంతో పాటు కొన్ని ఫిర్యాదులు కూడా వస్తున్నట్లు తెలిపారు. ఎక్కడా ఎవరికీ నగదు రూపంలో ఇవ్వకూడదన్నారు. ప్రతిదీ ఆన్‌లైన్ విధానంతో పాటు డిజిటల్ పద్ధతిలోనే చెల్లింపు ఉండాలన్నారు. నగదు ఇచ్చినా, తీసుకున్నా చర్యలు ఉంటాయని హెచ్చరించారు. వచ్చే రెండు నెలలూ అరటి ప్లాంటేషన్ జరిగే అవకాశం ఉన్నందున వర్షాభావ పరిస్థితులు, భూగర్భజలాలు, నీటి లభ్యత అంశాలపై రైతుల్లో అవగాహన కల్పించాలని ఆదేశించారు. రిజిస్ట్రేషన్లు, సీనియార్టీ ప్రకారం అర్హత జాబితా, ప్రాథమిక, తుది పరిశీలన, డాక్యుమెంటేషన్, బీటక్యూ, బీఎంఎస్, నాన్‌సబ్సిడీ చెల్లింపు, అడ్మినిస్ట్రేటివ్ శాంక్షన్స్, మెటీరియల్ సప్లై ఇన్‌స్టలేషన్ తదితర అంశాలపై కంపెనీల వారీగా ఇచ్చిన లక్ష్యం, పురోగతిపై సమీక్షించారు. ప్రస్తుతం అన్నింటా రాష్ట్రంలోనే అగ్రస్థానంలో ఉన్నా... లక్ష్యం పూర్తి చేయడంలోనూ మొదటి స్థానంలో నిలవాలని తెలిపారు. సమావేశంలో ఉద్యానశాఖ డీడీ రఘునాథరెడ్డి, ఏపీఎంఐపీ ఏపీడీ ఫజులున్నీసాబేగం తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా తెప్పోత్సవం



తెప్పపై విహరిస్తున్న వేంకటరమణస్వామి



శింగనమల చెరువులో తెప్పోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి దంపతులు

శింగనమల: మండల కేంద్రంలోని శింగనమల రంగరాయలు చెరువులో శుక్రవారం తెప్పోత్సవం వైభవంగా జరిగింది. మధ్యాహ్నం 4 గంటలకు సీతా ఆత్మరామస్వామి, భూదేవి, శ్రీదేవి సమేత గొలకొండ వేంకటరమణస్వామి, ఆంజనేయస్వామి, వాసవీ మాత విగ్రహాలను రామాలయం నుంచి చెరువు వద్దకు పల్లకీలో ఊరేగింపుగా తీసుకొచ్చారు. సాయంత్రం 6 గంటలకు విద్యుత్ దీప కాంతులు, పూలతో అలంకరించిన తెప్పపై విగ్రహాలను కొలువుదీర్చి రాత్రి 7.30 గంటల వరకు విహరింపజేశారు. అనంతరం ఉత్సవ విగ్రహాలను పురవీధుల్లో ఊరేగించారు.

ఎమ్మెల్యే దంపతుల పూజలు

ఏటా కార్తీక మాసం ద్వాదశి రోజున ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డి ఆధ్వర్యంలో తెప్పోత్సవం నిర్వహిస్తున్నారు. ఎమ్మెల్యేగా గెలిచిన అనంతరం వరుసగా ఐదోసారి ఈ తెప్పోత్సవాన్ని వేడుకగా నిర్వహించారు. తెప్ప చెరువు మధ్యలోకి వెళ్లిన తరువాత ఎమ్మెల్యే దంపతులు గంగ పూజ చేశారు. చెరువు నీటితో కళకళలాడుతూ పంటలు బాగా పండాలని, రైతులు, మత్స్యకారులు, ప్రజలు సుభిక్షంగా ఉండాలని స్వామివార్లను మొక్కుకున్నారు. పూజా కార్యక్రమాల్లో ఏపీ నాటక అకాడమీ చైర్‌పర్సన్ ప్రమీల, డీసీఎంఎస్ డైరెక్టర్ బొమ్మన శ్రీరామిరెడ్డి, ఎంపీపీ యోగేశ్వరి, వైస్ ఎంపీపీ విజయ, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య పాల్గొన్నారు.

పక్కాగా క్లెయిమ్‌ల పరిష్కారం

అనంతపురం అర్బన్: ప్రత్యేక ఓటరు సవరణలో భాగంగా నిర్వహించిన ఇంటింటి సర్వేలో వచ్చిన దరఖాస్తులు, రాజకీయ పార్టీల నుంచి వచ్చి అభ్యంతరాలను పక్కాగా పరిశీలించి పరిష్కరిస్తున్నామని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి (సీఈఓ) ముఖేష్‌కుమార్ మీనాకు కలెక్టర్ గౌతమి తెలిపారు. శుక్రవారం విజయవాడ నుంచి ఓటరు జాబితా సవరణలో వచ్చిన దరఖాస్తులు, అభ్యంతరాలు, పరిష్కార తీరుపై సీఈఓ జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. కలెక్టరేట్ నుంచి కలెక్టర్‌తో పాటు డీఆర్‌ఓ గాయత్రీదేవి పాల్గొన్నారు. జిల్లాలో క్లెయిమ్‌ల పరిశీలన, పరిష్కారంపై సీఈఓకు ఈ సందర్భంగా కలెక్టర్ వివరించారు. సవరణ క్రమంలో ఫారం–6, 7, 8 దరఖాస్తులను జాగ్రత్తగా పరిశీలించిన తరువాతే పరిష్కరిస్తున్నామన్నారు. రాజకీయ పార్టీల నుంచి అందిన ఫిర్యాదులను అప్‌డేట్ చేస్తున్నామన్నారు. సీఈఓ మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ నిబంధనలను పాటిస్తూ క్లెయిమ్‌లను నాణ్యతగా పరిష్కరించాలన్నారు. రాజకీయ పార్టీల ఫిర్యాదుల పరిష్కారంలో రాజీ పడకూడదని ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో ఆర్డీఓలు గ్రంధి వెంకటేశ్, రాణీసుస్మిత, సి.శ్రీనివాసులురెడ్డి, డిప్యూటీ కలెక్టర్లు రవీంద్ర, సుధారాణి, వెంకటేశ్వర్లు, ఎన్నికల డీటీ కనకరాజు, ఎస్‌ఏ శామ్యూల్ బెంజిమెన్ పాల్గొన్నారు.

28న ఎన్నికల రోల్ అబ్జర్వర్ రాక

ప్రత్యేక ఓటరు జాబితా సవరణ–2024లో భాగంగా ఈ నెల 28న ఎన్నికల రోల్ అబ్జర్వర్ మురళీధర్‌రెడ్డి జిల్లాకు విచ్చేయనున్నట్లు కలెక్టర్ గౌతమి శుక్రవారం వెల్లడించారు. ఉదయం 11 గంటలకు అనంతపురం చేరుకుని జిల్లాలో పర్యటించి ఓటరు జాబితా సవరణ ప్రక్రియలో భాగంగా వచ్చిన క్లెయిమ్‌లు, అభ్యంతరాల పరిశీలన ప్రక్రియను పరిశీలిస్తారని తెలిపారు.

ఎక్సైజ్‌లో 'మామూళ్ల' గోల

- బార్ల యాజమాన్యాలపై ఒత్తిడి
- ఉమ్మడి జిల్లాలో 36 బార్ల నుంచి నెలకు రూ.16.20 లక్షల వసూలు
- సెబ్, గోడౌన్ అధికారులూ ఒత్తిడి



సాక్షి ప్రతినిధి, అనంతపురం: ఎక్సైజ్ విభాగంలో అధికారులకు, బార్ల యజమానులకు మధ్య 'మామూళ్ల' వివాదం తారస్థాయికి చేరింది. ప్రతినెలా ఎక్సైజ్ డిపార్ట్‌మెంట్‌కు సొమ్ము ఇవ్వకపోతే ఏదో ఒక రకంగా ఇబ్బంది పెడుతున్నారని బార్ల యజమానులు ఆరోపిస్తున్నారు. అనంతపురం, శ్రీసత్యసాయి రెండు జిల్లాల్లోనూ ఈ వసూళ్ల బాగోతం సాగుతోంది.

నిర్ణయించిన మేరకు ఇవ్వాల్సిందే: ప్రతి బార్ యజమాని 'నిర్ణీత రుసుం' ఇవ్వాల్సిందేనని ఎక్సైజ్ అధికారులు ఒత్తిడి తెస్తున్నట్టు తెలిసింది. ఒక్కో బార్ యజమాని నెలకు రూ.45 వేలు ఈ విభాగానికి ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నట్లు సమాచారం. లేదంటే నిర్ణయించిన సమయం కంటే ముందు బార్ ఓపెన్ చేశారనో, ఆలస్యంగా బార్ మూస్తున్నారనో దాడులు చేస్తామని బెదిరిస్తున్నట్టు సమాచారం. మరోవైపు అనంతపురంలోని రామ్‌నగర్‌లో ఓ బార్‌కు నిబంధనలకు విరుద్ధంగా అనుమతులు ఇచ్చి.. నిర్వాహకుల నుంచి భారీగా సొమ్ము తీసుకున్నట్టు ఆరోపణలొచ్చాయి. బార్ పక్కనే ఆస్పత్రి, విద్యా సంస్థలు ఉన్నా అనుమతులు ఇచ్చారని తేలింది. అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాలో 36 వరకూ బార్లు ఉన్నాయి. వీటిలో ఒక్కో బార్‌కు రూ.45 వేల చొప్పున నెలకు అన్ని బార్ల నుంచి రూ.16.20 లక్షలు ఎక్సైజ్ విభాగానికి చేరుతున్నట్టు తెలిసింది. ఒక సీఐ స్థాయి వ్యక్తికి ఈ సొమ్ము చేర్చి పంపకాలు చేస్తున్నారు.

ఒకరిని చూసి మరొకరు డిమాండ్ : ఓ వైపు ఎక్సైజ్ అధికారులు మామూళ్ల కోసం ఒత్తిడి తెస్తుండగా... మరోవైపు సెబ్ (స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో) అధికారులు తమకూ మామూళ్లు ఇవ్వాల్సిందేనని పట్టుబడుతున్నారు. వీళ్లతో పాటు లిక్కర్ గోడౌన్ అధికారులు సైతం డిమాండ్ చేస్తున్నారు. నెలకు ఒక్కో బార్ యజమాని గోడౌన్‌కు రూ.15 వేలు, సెబ్‌కు రూ.15 వేలు ముట్టజెబుతున్నట్లు ఓ బార్ యజమాని చెప్పారు.

ఎక్సైజ్ మామూళ్లు ఇవ్వలేం! : బార్ల యజమానులు ఇటీవల సమావేశం నిర్వహించి ఇక నుంచి ఎక్సైజ్ అధికారులకు మామూళ్లు ఇచ్చేది లేదని తీర్మానించినట్టు తెలిసింది. ఎక్సైజ్ అధికారులు ప్రతి నెలా ఇచ్చే రూ.45 వేలు కాకుండా ఎక్కువ మొత్తంలో డిమాండ్ చేశారని, దీంతో తాము ఇవ్వలేమని తీర్మానించామని ఓ బార్ యజమాని 'సాక్షి'తో చెప్పారు.

మామూళ్లు అవాస్తవం

బార్ల యాజమాన్యాల నుంచి నెల నెలా మామూళ్లు వస్తున్నాయనడం అవాస్తవం. మాకు ఎవరూ మామూళ్లు ఇవ్వడం లేదు. ఈ ఆరోపణల్లో వాస్తవం లేదు. మేము ఎప్పుడూ డబ్బు అడగలేదు.

–మధుసూదన్, ఎక్సైజ్ సూపరింటెండెంట్

క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి


ఘటన స్థలం వద్ద ప్రమాదానికి గురైన ఆటో

డి హీరేహాళ్(రాయదుర్గం): బళ్లారి– బెంగళూరు జాతీయ రహదారిపై డీ హీరేహాళ్ మండల కేంద్రం పోలీస్‌స్టేషన్‌కు కూతవేటు దూరంలో శుక్రవారం వేకువజామున రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో ఆటోడ్రైవర్ ప్రకాష్ (28) అక్కడికక్కడే మృతి చెందగా బస్సులో ప్రయాణిస్తున్న మరో 30 మంది త్రుటిలో ప్రాణాపాయం నుంచి తప్పించుకున్నారు. ఎస్ఐ రంగడుయాదవ్ వివరాలమేరకు.. మృతుడు ప్రకాష్ టాటా ఏస్ లగేజీ వాహనంలో రాంపురం నుంచి ఉల్లిగడ్డలు లోడ్ చేసుకుని బళ్లారి మార్కెట్‌కు తరలిస్తున్నాడన్నారు. బెంగళూరు నుంచి బళ్లారి వైపు ప్రయాణికులతో వస్తున్న ఎస్ఆర్‌జే ప్రైవేటు ట్రావెల్ బస్సు ఘటనా స్థలం వద్దకు రాగానే వెనుక వైపు నుంచి టాటాఏస్ వాహనాన్ని ఢీ కొందని చెప్పారు. ప్రమాదంలో డ్రైవర్ ప్రకాష్ అక్కడికక్కడే మృతి చెందగా బస్సులో ప్రయాణిస్తున్న 30 మంది త్రుటిలో ప్రాణాపాయం నుంచి బయటపడినట్లు పేర్కొన్నారు.

ఇద్దరు కాపర్ దొంగల అరెస్టు


దొంగలను అరెస్టు చూపుతున్న పోలీసులు

యాడికి: కాపర్ వైరును అపహరిస్తున్న ఇద్దరు దొంగలను అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ఐ గురుప్రసాద్‌రెడ్డి తెలిపారు. మండలంలోని వేములపాడు సమీపంలో అజూర్ సోలార్ ప్లాంట్‌లో ఇటీవల కాపర్ వైరు చోరీకి గురైందన్నారు. ఈ ఘటనపై నిర్వాహకులు ఫిర్యాదు చేశారన్నారు. ఈ క్రమంలో శుక్రవారం మేములపాడు జాతీయ రహదారిలో ఉన్న మోడల్ స్కూల్‌వ ద్ద అనుమానాస్పదంగా తచ్చాడుచున్న కళ్యాణదుర్గంకు చెందిన గంగన్న (21), నాగన్న(60)ను అదుపులోకి తీసుకుకొని విచారించగా సోలార్ ప్లాంట్‌లో కాపర్ వైరును దొంగిలించినట్లు నిర్ధారణ అయిందన్నారు. కోర్టులో హాజరుపర్చగా న్యాయమూర్తి రిమాండ్‌కు ఆదేశించారన్నారు.

పామిడిలో టీడీపీకి ఎదురుదెబ్బ

- వైఎస్సార్‌సీపీలోకి భారీగా చేరికలు

పామిడి: '40 ఏళ్లుగా టీడీపీ అభివృద్ధి కోసం పార్టీ నాయకులు, కార్యకర్తలుగా పనిచేశాం. అధికారం కోసం మాత్రమే మమ్మల్ని పావులుగా వాడుకున్నారే తప్ప... ప్రాధాన్యత కల్పిస్తూ ప్రజలకు చేసిందేమి లేదు. అందుకే విసిగిపోయాం. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ సారథ్యంలో ఎమ్మెల్యే వై వెంకట్రామిరెడ్డి నాయకత్వంలో పామిడిలో కనీవినీ ఎరుగని రీతిలో జరిగింది. అభివృద్ధికి ఆకర్షితులై వైఎస్సార్‌సీపీలో చేరాము' అని బోయ వెంకట్రాముడు, వెంకటేష్, గొర్ల సుంకన్న తదితరులు తెలిపారు. శుక్రవారం పామిడిలో ఏర్పాటు చేసిన సభలో వైఎస్సార్‌సీపీ మండల నాయకులు, గుత్తి మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ పెమ్మక చెన్నకేశవరెడ్డి ఆధ్వర్యంలో పామిడిలోని 4, 5, 9, 14, 18, 19, 20 వార్డులతో పాటు పామిడి స్టేషన్, పీ కొత్తపల్లి గ్రామాలకు చెందిన వంద కుటుంబాలు వైఎస్సార్‌సీపీలో చేరాయి. అభివృద్ధి, సంక్షేమమే రెండుకళ్లుగా పనిచేస్తున్న వైఎస్సార్‌సీపీ గెలుపే ధ్యేయంగా పనిచేస్తామని నూతనంగా పార్టీలోకి చేరిన వారు అన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వై వెంకట్రామిరెడ్డి మాట్లాడుతూ తనతో పాటు ఎంపీ రంగయ్య రూ.3.15 కోట్లతో వరద ఉధృతిలో పామిడి–కల్లూరు నడుమ వంతెనను 9 నెలలలో పూర్తి చేసి వాహన, పాదచారుల రాకపోకలను సుగమం చేశామన్నారు. రూ.2 కోట్లతో మండలంలో సీసీ రోడ్లు, తాగునీటి వంటి మౌలిక వసతులు, మరో రూ. 5 కోట్ల మంజూరుతో డ్రైనేజీ, ఇతరత్రా అభివృద్ధి పనులు చేపట్టడానికి కృషి చేస్తున్నామన్నారు.వైఎస్సార్‌సీపీ మండల ఇన్‌చార్జ్ సీబీ జానకిరామిరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి చుక్కలూరు దిలీప్‌రెడ్డి, పట్టణ కన్వీనర్ జోజోడే కుమార్, వైస్ కన్వీనర్ శివారెడ్డి, రామకృష్ణారెడ్డి, బీసీ సెల్ పట్టణ కన్వీనర్ నగేష్ పాల్గొన్నారు.


ఎమ్మెల్యే వైవీఆర్ సమక్షంలో టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలోకి చేరిన దృశ్యం

బాధిత బాలికకు అండగా ఉంటాం

- ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి


బాలికతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అనంత

అనంతపురం మెడికల్: ప్రభుత్వ సర్వజనాస్పత్రిలో చికిత్స పొందుతున్న బాలికకు ప్రభుత్వం అన్ని విధాల అండగా ఉంటుందని ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి తెలిపారు. శుక్రవారం మహిళా కమిషన్ సభ్యురాలు రుఖియాబేగం, హజ్ కమిటీ చైర్మన్ గౌసుల్ ఆజమ్, తదితరులతో కలసి జీజీహెచ్‌లో అడ్మిషన్‌లో ఉన్న బాలికను పరామర్శించారు. మైనర్‌తో పాటు ఆమె తల్లితో ఎమ్మెల్యే మాట్లాడారు. దాడికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా బాధితురాలి తల్లి తన బిడ్డ యజమానుల ఇంట్లో పడ్డ నరకాన్ని ఎమ్మెల్యేకు వివరంగా తెలియజేశారు. ఏం భయపడాల్సిన పనిలేదని, తామందరూ మీ వెంట ఉన్నామని ఎమ్మెల్యే భరోసా ఇచ్చారు. అనంతరం వైద్యులతో బాలిక ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీసి మెరుగైన వైద్యం అందించాలని సూచించారు. అనంతరం ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ... బాలిక పరిస్థితి హృదయవిదారకరమని, ఈ ఘటనకు కారకులైన వారెవరైనా కఠినంగా శిక్షించాల్సిందేనన్నారు. బాలికకు చదివించే బాధ్యత ప్రభుత్వం తీసుకుంటుందన్నారు. మేయర్ వసీం, మహిళా కమిషన్ సభ్యురాలు రుఖియాబేగం, రాష్ట్ర హజ్ కమిటీ చైర్మన్ గౌసుల్ ఆజమ్ మాట్లాడుతూ బాలిక ఘటనను తెలుగుదేశం, జనసేన పార్టీలు రాజకీయంగా వాడుకోవాలని చూశాయని విమర్శించారు. రాష్ట్ర మైనార్టీ సలహాదారుడు హబీబుల్లా మాట్లాడుతూ మహిళలకు రక్షణ కల్పించడంలో జగనన్న ప్రభుత్వం ముందుంటుందన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ నదీం అహ్మద్, వక్ఫ్‌బోర్డు జిల్లా చైర్మన్ కాగజ్‌ఘర్ రిజ్వాన్, మార్కెట్ యార్డు చైర్మన్ ఫయాజ్, మైనార్టీ విభాగం జిల్లా అధ్యక్షుడు సైపుల్లాబేగ్, కార్పొరేటర్లు ఇషాక్, బాబా, నాయకురాళ్లు కృష్ణవేణి, మునీర, కమర్‌తాజ్, ఖాజా, వేమల నదీం, తానీష, రఫి, నియాజ్ తదితరులు పాల్గొన్నారు.

మద్యానికి డబ్బు ఇవ్వలేదని వ్యక్తి ఆత్మహత్య

కుందుర్పి: మద్యం తాగడానికి డబ్బులు ఇవ్వలేదని మనస్తాపానికి గురై వ్యక్తి ఆత్మహత్య చేసుకొన్న సంఘటన మలయనూరులో చోటు చేసుకోంది. పోలీసుల వివరాల మేరకు.. మలయనూరుకు చెందిన మాల తిప్పేస్వామి (47) మద్యానికి బానిసై రోజూ భార్య యల్లమ్మతో గొడవ పడేవాడన్నారు. శుక్రవారం ఉదయం తిప్పేస్వామి మద్యానికి డబ్బులు ఇవ్వాలని భార్యతో గొడవ పడ్డాడన్నారు. అయితే డబ్బులు తన దగ్గరలేవని భార్య చెప్పడంతో మనస్తాపానికి గురై గ్రామ శివార్లోని చెక్‌పోస్టు సమీపంలో చెట్టుకు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకొన్నాడని చెప్పారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు. మృతుడికి భార్యతో పాటు నాలుగేళ్ల కుమారుడు ఉన్నారు.

గంజాయి విక్రయదారుల అరెస్టు

- 3.5 కేజీల గంజాయి స్వాధీనం


స్వాధీనం చేసుకున్న గంజాయిని చూపుతున్న ఎస్పీ అన్బురాజన్

అనంతపురం క్రైం: అనంత కేంద్రంగా గంజాయి వ్యాపారం చేస్తున్న ముగ్గురిని అనంత పోలీసులు అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి 3.5 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. శుక్రవారం స్థానిక పోలీసు కాన్ఫరెన్స్ హాలులో సీఐ రెడ్డెప్పతో కలసి ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ నిందితుల వివరాలను వెల్లడించారు. వన్‌టౌన్ పోలీసుస్టేషన్ పరిధిలోని భవానీ నగర్‌కు చెందిన షేక్ సోనూ, ఆత్మకూరు మండలం వేపచెర్ల తండాకు చెందిన దొంగావత్ శివశంకరనాయక్ (ప్రస్తుతం ఇతను అరవిందనగర్‌లో నివాసం ఉంటున్నాడు), గుత్తికి చెందిన పీరం గణేష్ నిందితులు. ఈ ముగ్గురిలో షేక్ సోనూ ప్రధాన నిందితురాలు. ఈమెకు రాయచోటికి చెందిన బాబ్జీతో వివాహం కాగా నాలుగేళ్ల క్రితం రోడ్డు ప్రమాదంలో భర్త చనిపోయాడు. అప్పటి నుంచి పుట్టింట్లో ఉంటూనే ఇళ్ల పని చేస్తూ జీవనం సాగించేది. ఈక్రమంలో 8 నెలల కిందట ఆమె తమ్ముడు షేక్ బాబా ఫక్రుద్దీన్ అలియాస్ బబ్లూ గతంలో గంజా వ్యాపారం చేస్తూ గిద్దలూరు పోలీసులకు పట్టుబడి జైలుకు కూడా వెళ్లొచ్చాడు. అప్పటి నుంచే షేక్ సోనూ కుటుంబ పోషణకు, సులభంగా డబ్బు సంపాదించవచ్చని రైలులో కాకినాడ జిల్లా తునికి వెళ్లి అక్కడి నుంచి గంజాయి తీసుకువచ్చేది. నగరానికి చెందిన పఠాన్ జాఫర్‌ఖాన్‌తో కలిసి తన ఇంటి వద్దనే చిన్న పాకెట్ లుగా కట్టి కిలో రూ.15 వేల నుంచి రూ.20 వేలకు అమ్ముతోంది. ఈ క్రమంలో గంజాయి కొనేందుకు ఆమె తుని వచ్చినప్పుడు గంజాయి వ్యాపారం చేసే గుత్తి మండలం పీ. కొత్తపల్లికి చెందిన ముంబై నరేశ్, అనంతపురంకు చెందిన పవన్‌కుమార్ పరిచయమయ్యారు. నరేశ్.. గుత్తికి చెందిన పీరం గణేశ్‌తో పాటు మరికొందరికి గంజాయి అమ్మేవాడు. అప్పుడప్పుడు శివశంకర్‌నాయక్‌కు, పీరం గణేశ్ కుమార్‌కు కూడా గంజాయి సరఫరా చేసేది. శివశంకర్ నాయక్ నగరానికి చెందిన పవన్ కుమార్‌తో గంజాయి కొని అమ్మేవాడు. ప్రస్తుతం పవన్ కుమార్ జైలులో ఉన్నాడు. అతడు చెప్పిన వివరాల మేరకు అప్పుడప్పుడు షేక్ సోనూతో గంజాయి కొనేవాడు. ఈ క్రమములో షేక్ సోనూ తుని నుంచి తెచ్చిన గంజాయిని శివశంకర్ నాయక్, బోయ నరేశ్‌కు అమ్ముతుండగా గుత్తి రోడ్డులోని మిర్చి యార్డ్ సర్కిల్ వద్ద ముగ్గురిని అదుపులోకి తీసుకొని 3.5 కిలోలు గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. వన్‌టౌన్ సీఐ రెడ్డెప్ప ఎస్ఐ వెంకటేశ్వర్లు, సిబ్బందిని జిల్లా ఎస్పీ అన్బురాజన్ అభినందించారు.

మూడిళ్లలో చోరీ

బత్తలపల్లి: మండల కేంద్రమైన బత్తలపల్లిలో గురువారం రాత్రి దొంగలు రెచ్చిపోయారు. ఏకంగా మూడిళ్లలో చోరీకి పాల్పడ్డారు. బత్తలపల్లి పోలీసుల వివరాలమేరకు... బత్తలపల్లి ఎస్సీ కాలనీలో మాతంగి శంకర్ ఇంటికి తాళం వేసి ఉండటంతో ఆ ఇంట్లోకి దొంగలు ప్రవేశించి ఒక జత కమ్మలు, చిన్న ఉంగరాలు ఆరు, వెండి గొలుసు ఒకటి, రెండు వెండి కడియాలు అపహరించారు. అలాగే బీసీ కాలనీలో ఆదినారాయణమ్మ ఇంట్లో మూడు జతలు కమ్మలు, వెండి గొలుసులు ఎత్తుకెళ్లారు. ఆ తర్వాత ఆదెమ్మ ఇంట్లోకి ప్రవేశించి చిన్న ఉంగరాలు మూడు, ఒక జత వెండి గొలుసులను దొంగిలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

జనవాక్కు

ప్రైవేటుకు దీటుగా ప్రభుత్వ బడులు



రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాడు–నేడు కార్యక్రమం ద్వారా ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మారాయి. నేను పని చేస్తున్న కంబదూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సుమారు రూ.కోటికి పైగా నిధులను వెచ్చించి పాఠశాలను అభివృద్ధి చేశారు. కొత్త గదులు, వంట గది, మరుగుదొడ్లను నిర్మించడంతో పాటు విద్యార్థులకు నాణ్యమైన డెస్కులు, తాగునీటి కోసం ఆర్వో వాటర్ ప్లాంట్, తరగతి గదుల్లో డిజిటల్ బోర్డులు ఏర్పాటు చేశారు. ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో కూడా అన్ని వసతులు ఉండటంతో అడ్మిషన్లు పెరిగాయి. విద్యను టెక్నాలజీతో అనుసంధానం చేసిన రాష్ట్రం దేశంలో ఎక్కడలేదు. కేవలం మన రాష్ట్రం మాత్రమే.

– రవీంద్రనాథ్, జిల్లా ప్రధాన కార్యదర్శి, గిరిజన ఉపాధ్యాయ సంఘం

ఖర్చు లేకుండా ధ్రువపత్రాలు



కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాల కోసం గతంలో చాలా ఇబ్బంది పడ్డాము. అయితే ప్రస్తుతం ధ్రువీకరణ పత్రాలు 24 గంటల్లోనే అది కూడా పైసా ఖర్చు లేకుండా వలంటీరే ఇంటికి తెచ్చి ఇస్తున్నారు. జగనన్న సురక్ష కార్యక్రమంలో మా ఇంట్లో వాళ్లకు అవసరమైన కుల, ఆదాయం వంటి ధ్రువీకరణ పత్రాలు చాలా సులువుగా చేతికిచ్చారు. దీంతో కాపు నేస్తం పథకం ద్వారా ప్రభుత్వం నుంచి రూ. 15 వేలు ఆర్థికసాయం పొందాను. జగన్‌ను ఎప్పటికీ మర్చిపోము.

– లక్ష్మీదేవి, ఓల్డ్ సీపీఐ కాలనీ, గుత్తి

పెట్టుబడి సాయంతో భరోసా



మాకు 4.5 ఎకరాల వ్యవసాయ సాగు భూమి ఉంది. అందులో ఎకరాలో మామిడి తోట సాగు చేశా. కుటుంబమంతా పూర్తిగా వ్యవసాయం పైనే ఆధారపడి జీవిస్తున్నాము. మిగిలిన పొలంలో వేరుశనగతో పాటు ఇతర పంటలను సాగు చేస్తున్నాము. రైతుకు వ్యవసాయం భారం కాకూడదన్నా ఉద్దేశంతో ప్రభుత్వం ప్రతి ఏటా పెట్టుబడి సాయం అందిస్తోంది. నాలుగేళ్లుగా సుమారు రూ. 54 వేలు పెట్టుబడి సాయం పొందాను. మహానేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి మాదిరిగానే ఇచ్చిన మాటను ఆయన తనయుడు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కూడా పేదలకు న్యాయం చేస్తున్నారు. రాబోవు రోజుల్లో మా మద్దతు ఆయనకే ఇస్తాం.

– హనుమంతరాయప్ప, టీడీ పల్లి ,రొళ్ల మండలం

సంకల్ప యాత్ర నిర్వహణకు ఏర్పాట్లు



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ గౌతమి

అనంతపురం అర్బన్: జిల్లాలో వికసిత్ భారత్ సంకల్ప యాత్ర నిర్వహణకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేపట్టామని జిల్లా పబరి అధికారి (ఇన్‌చార్జి ఆఫీసర్), ఐఆర్ఎస్ఎస్ ఈడీ సచ్చింద్రకుమార్ పట్నాయక్‌కు కలెక్టర్ ఎం.గౌతమి తెలిపారు. సంకల్ప యాత్ర నిర్వహణపై ఇన్‌చార్జి అధికారి శుక్రవారం ఢిల్లీ నుంచి అనంతపురం, చిత్తూరు జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. కలెక్టరేట్ నుంచి కలెక్టర్‌తో పాటు డీపీఓ ప్రభాకర్‌రావు, జిల్లాస్థాయి కమిటీ సభ్యులు పాల్గొన్నారు. జిల్లాలో సంకల్ప యాత్ర నిర్వహణపై ప్రబరి అధికారికి కలెక్టర్ వివరించారు. జిల్లాలో శనివారం నుంచి జనవరి 24వ తేదీ వరకు 60 రోజుల పాటు సంకల్ప యాత్ర నిర్వహణకు గ్రామస్థాయి నుంచి జిల్లాస్థాయి వరకు కమిటీలు ఏర్పాటు చేశామని చెప్పారు.

డీపీఓలో కంట్రోల్ రూమ్

సంకల్ప యాత్రకు సంబంధించి జిల్లా పంచాయతీ కార్యాలయంలో కమాండ్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామన్నారు. అర్హత ఉండి పథకాల ద్వారా లబ్ధి పొందని వారిని గుర్తించి వర్తింపజేస్తామన్నారు. కార్యక్రమ నిర్వహణకు ప్రస్తుతం రెండు వ్యాన్‌లు వచ్చాయని, మరో మూడు వ్యాన్‌లు రావాల్సి ఉందన్నారు. ఉదయం ఒక గ్రామం మధ్యాహ్నం ఒక గ్రామంలో నిర్వహించనున్నట్లు చెప్పారు. శనివారం యల్లనూరు మండలం బసినేపల్లి, బసినేపల్లి తండా, కణేకల్లు మండలం బ్రహ్మసముద్రం, బెనికల్, గుంతకల్ మండలం కొంగనపల్లి, ఓబుళాపురం గ్రామాల్లో సంకల్ప యాత్ర నిర్వహిస్తామన్నారు. జిల్లా ప్రబరి అధికారి మాట్లాడుతూ వికసిత్ భారత్ సంకల్ప యాత్ర దారా కేంద్ర ప్రభుత్వ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు.

ప్రిస్క్రిప్షన్‌తోనే యాంటీ బయాటిక్స్


అవగాహన ర్యాలీని ప్రారంభిస్తున్న డీఎంహెచ్ఓ భ్రమరాంబదేవి


- డీఎంహెచ్ఓ భ్రమరాంబదేవి

అనంతపురం మెడికల్: వైద్యుల ప్రిస్క్రిప్షన్‌తోనే యాంటీ బయాటిక్స్ ఇవ్వాలని, ఇష్టారాజ్యంగా మందుల షాపుల నిర్వాహకులు, ఆర్ఎంపీ వైద్యులు వ్యవహరిస్తే చర్యలు తప్పవని డీఎంహెచ్ఓ ఈ భ్రమరాంబ హెచ్చరించారు. శుక్రవారం ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో యాంటీ బయాటిక్స్ వాడకంపై ఏర్పాటు చేసిన ర్యాలీని డీఎంహెచ్ఓ జెండా ఊపి ప్రారంభించారు. ర్యాలీ డీఎంహెచ్ఓ కార్యాలయం నుంచి జీజీహెచ్‌కు వరకూ సాగింది. అనంతపురం ప్రభుత్వ సర్వజనాస్పత్రి ముందు మానవహారంగా ఏర్పడి యాంటీ బయాటిక్స్ వాడకంతో కలిగే దుష్పరిణామాలపై నినాదాలు చేశారు. డీఎంహెచ్ఓ మాట్లాడుతూ ప్రతి చిన్న వ్యాధికీ యాంటీ బయాటిక్స్ వాడుతున్నారని, తద్వారా భవిష్యత్తులో యాంటీ బయాటిక్స్ పని చేయవన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఆర్ఎంపీ వైద్యులు అధికంగా యాంటీ బయాటిక్స్ ఇస్తున్నారన్నారు. ప్రజలకు మెరుగైన వైద్యం అందించేందుకు ప్రభుత్వం ఆస్పత్రులను బలోపేతం చేసి అన్ని రకాల మందులను అందుబాటులో ఉంచిందన్నారు. వైద్యుల సలహా మేరకు యాంటీ బయాటిక్స్‌ను తగిన మోతాదులో తీసుకుని వాడాలన్నారు. కార్యక్రమంలో ప్రోగ్రాం అధికారులు సుజాత, యుగంధర్, అనుపమజేమ్స్, ఏఓ గిరిజా మనోహర్, డెమో ఉమాపతి, డిప్యూటీ డెమోలు త్యాగరాజు, గంగాధర్, తదితరులు పాల్గొన్నారు.

27న చెన్నేకొత్తపల్లిలో 'రెడ్ల వనభోజనం'

రాప్తాడురూరల్: కార్తీక శుద్ద పౌర్ణమిని పురస్కరించుకుని ఈనెల 27న సత్యసాయి జిల్లా రాప్తాడు నియోజకవర్గ పరిధిలోని చెన్నేకొత్తపల్లి మండలం కనుమ వెంకటేశ్వరస్వామి ఆలయంలో రెడ్డి కులస్తుల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున 'రెడ్ల వనభోజనం' కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. రాప్తాడు నియోజకవర్గ వ్యాప్తంగా అన్ని మండలాల నుంచి వేలాదిమంది రెడ్డి కుటుంబ సభ్యులు హాజరయ్యేలా నిర్వాహకులు ఏర్పాట్లు చేస్తున్నారు. వనభోజనం సందర్భంగా స్వామి వారికి కార్తీక దామోదర హోమం, రాజ్యశ్యామల హోమం, లక్ష్మీగణపతి హోమం నిర్వహించనున్నారు. చెన్నేకొత్తపల్లి రెడ్డి సంఘం ఆధ్వర్యంలో భారీ ఎత్తున ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటికే ఆహ్వాన పత్రికలు ముద్రించి రెడ్డి కులస్తులకు ఆహ్వానం పలుకుతున్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా ఉండే రెడ్డి కులస్తులందరూ తరలి వచ్చి విజయవంతం చేయాలని రెడ్డి సంఘం నాయకులు పిలుపునిచ్చారు.

విద్యా బోధన సులభతరంగా ఉండాలి


కూడేరు: మాట్లాడుతున్న సమగ్ర శిక్ష అడిషనల్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ వరప్రసాద్‌రావు

కూడేరు: విద్యలో వెనుకబడిన విద్యార్థులకు సులభతరంగా విద్యా బోధన చేసి వారిలో విద్యా సామర్థ్యాన్ని పెంపొందించాలని సమగ్ర శిక్ష అడిషనల్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ (ఏపీసీ) వరప్రసాద్ రావు సూచించారు. కూడేరు హైస్కూల్‌లో కాంప్లెక్స్ స్థాయిలో 6, 7, 8 తరగతులకు గణితం సబ్జెక్ట్ బోధించే ఆత్మకూరు, కూడేరు, బెలుగుప్ప మండలాలకు చెందిన ఉపాధ్యాయులకు లిప్ (లర్నింగ్ ఇంప్రూవ్‌మెంట్ ప్రోగ్రాం)పై శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఆయన తనిఖీ చేశారు. మీ బోధనే పిల్లల బంగారు భవిష్యత్‌కు బాటలు వేస్తాయని, కాబట్టి విద్యార్థులందరినీ దృష్టిలో పెట్టుకొని బోధన చేయాలన్నారు. తర్వాత భవిత కేంద్రాన్ని తనిఖీ చేశారు. రోజూ ఎంత మంది హాజరవుతున్నారని ఐఈఆర్టీ మస్తానయ్యతో ఆరా తీశారు. రికార్డులను పరిశీలించారు. కూడేరు హైస్కూల్‌లో నాడు–నేడు కింద నిర్మిస్తున్న అదనపు తరగతి గదులను పరిశీలించారు. నిర్మాణపు పనులు నిదానంగా జరుగుతుండడంపై అసంతృప్తిని వ్యక్తం చేశారు.


ఎస్కేయూలో భారీగా పదోన్నతులు


పదోన్నతి ఉత్తర్వులను అందజేస్తున్న వీసీ మాచిరెడ్డి రామకృష్ణారెడ్డి

అనంతపురం: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలోని బోధనేతర సంఘం ఉద్యోగులకు పదోన్నతులు కల్పించారు. ఈ మేరకు ఎస్కేయూ వీసీ మాచిరెడ్డి రామకృష్ణారెడ్డి ఆదేశాల మేరకు రిజిస్ట్రార్ ఎంవీ లక్ష్మయ్య శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు.

- ఆనందరాజు , నాగమ్మ, ఎం.శంకర్, బండారు వెంకట్రాముడు సూపరింటెండెంట్ నుంచి అసిస్టెంట్ రిజిస్ట్రార్‌గా పదోన్నతి దక్కింది.
- మద్దిలేటి, ఎస్. నాగభూషణం అసిస్టెంట్ రిజిస్ట్రార్ నుంచి డిప్యూటీ రిజిస్ట్రార్‌గా పదోన్నతి దక్కింది.
- సీనియర్ అసిస్టెంట్ నుంచి సూపరింటెండెంట్‌గా 14 మందికి పదోన్నతులు దక్కాయి. వారిలో జి. వెంకటరాముడు, ఎస్. మారుతి, బి.శ్రీలత, ఏ. శివ ప్రసాద్, వి. గోవింద రెడ్డి, బి. ఈశ్వరయ్య, ఆర్. ఉమా శంకర్, ఎం. శ్రీనివాసులు, పి. శ్రీనివాసులు, ఎస్. చంద్రమ్మ, వీవీ సుబ్రమణ్యం, కె.పవన్ కుమార్, బి. నాగసుధ, షేక్ మహమ్మద్ ఇలియాజ్ ఉన్నారు.
- క్యాంపస్‌లో వివిధ కార్యాలయాల్లో పని చేస్తున్న 17 మంది సీనియర్, జూనియర్ అసిస్టెంట్, టైం, మినిమం స్కేల్, కన్సాలిడేటెడ్ పే ఉద్యోగులు 28 మందిని శుక్రవారం బదిలీ చేశారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి


మృతుడు రమేష్

యల్లనూరు: విద్యుదాఘాతంతో కౌలు రైతు రమేష్ (29) మృత్యువాతపడిన ఘటన యల్లనూరు మండలం గొడ్డుమర్రిలో చోటు చేసుకుంది. స్థానికుల వివరాలమేరకు... గొడ్డుమర్రికి చెందిన వెంకటకృష్ణారెడ్డి మూడెకరాల పొలంలో దానిమ్మచెట్లను సాగుచేస్తున్నారు. ఈ పొలాన్ని ఐదు సంవత్సరాలుగా కప్పల రమేష్ కౌలు చేసుకుంటున్నాడు. శుక్రవారం దానిమ్మ చెట్లకు నీళ్ల పెట్టేందుకు వెళ్లి మోటారు ఆన్ చేసేందుకు వెళ్లాడు. మోటారు వైర్లను కరెంటు స్తంభానికి తగిలిస్తుండగా ఒక వైరు జారి పడి రమేష్ ఛాతిపై పడింది. అక్కడికక్కడే విద్యుదాఘాతంతో మృతి చెందారు. భార్య సాత్విక, కుమారులు ఆకాష్, రణదీప్, కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరుగా విలపించారు. పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

క్లుప్తంగా

వాసవీదీక్ష పోస్టర్ల విడుదల

అనంతపురం కల్చరల్: నగరంలోని పాతూరు అమ్మవారిశాలలో వాసవీదీక్ష పోస్టర్లను శుక్రవారం విడుదల చేశారు. ఆర్యవైశ్య సంఘం ప్రతినిధులు సత్యనారాయణ, బొగ్గరపు రవీంద్ర తదితరులు మాట్లాడుతూ వాసవీ మండల దీక్షలు డిసెంబరు 29న, అర్ధమండల దీక్షలు జనవరి 19న, ప్రత్యేక దీక్షలు 29న ప్రారంభమవుతాయన్నారు. వివరాలకు పాతూరు వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో వాసవీదీక్షా సమితి అధ్యక్ష కార్యదర్శులు శ్రీనివాసులు, ప్రధాన కార్యదర్శి అరుణ్‌కుమార్, కృష్ణకుమార్, శబరి, వరప్రసాద్, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

ఉయ్యాలవాడ ధైర్యసాహసాలు చాటిచెప్పండి



ఉయ్యాలవాడ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న దృశ్యం

అనంతపురం టవర్‌క్లాక్: ఉయ్యాల వాడ నరసింహారెడ్డి ధైర్యసాహసాలను భవిష్యత్ తరాలకు చాటిచెప్పాలని ఆంధ్రప్రదేశ్ రెడ్డి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గంగుల కుంట నరేష్‌కుమార్‌రెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక టవర్‌క్లాక్ వద్ద ఉయ్యాలవాడ నరసింహారెడ్డి జయంతి సందర్భంగా విగ్రహం ఏర్పాటు చేసే స్థలంలో ఆయన చిత్రపటం పెట్టి, నివాళులర్పించారు. నరేష్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ త్వరలోనే ఉయ్యాలవాడ నరసింహారెడ్డి 14 అడుగుల కాంస్య విగ్రహం ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సాహితీవేత్త టీపీ రెడ్డి, నాయకులు పాటిల్ రామకృష్ణారెడ్డి, కోనా రాజారెడ్డి, నాగేశ్వర్‌రెడ్డి, కృష్ణారెడ్డి, రాజేష్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, రమేష్‌రెడ్డి, ఆదికేశవరెడ్డి పాల్గొన్నారు.

'ఆశ్రయ'కు పెన్షనర్ల చేయూత

అనంతపురం రూరల్: కాట్నేకాలువ ఆశ్రయ అనాథ ఆశ్రమంలో పెన్షనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిత్యావసర సరుకులు, చీరలు, దుప్పట్లు, ఎయిర్‌కూలర్ అందించారు. శుక్రవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పెన్షనర్స్ అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు కొండప్ప, కేఎస్ ఫజుల్ హక్ మాట్లాడారు. తమ అసోసియేషన్ ఆధ్వర్యంలో భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలు చేస్తామన్నారు. కార్యక్రమంలో అసోషియేషన్ నాయకులు, ఆశ్రమ నిర్వాహకులు పాల్గొన్నారు.

మహాబోధి కృష్ణమూర్తికి కళామిత్ర అవార్డు



అనంతపురం కల్చరల్: జిల్లాకు చెందిన మహాబోధి దాసన్నగారి కృష్ణమూర్తి కళామిత్ర అవార్డుకు ఎంపికయ్యారు. ఒంగోలుకు చెందిన కళామిత్ర మండలి ఆధ్వర్యంలో తెలుగు రాష్ట్రాల్లో సాహిత్య, సామాజిక, కళా సేవా రంగాల్లో విశిష్ట సేవలందిస్తున్న వారిని కళామిత్ర అవార్డులకు ఎంపిక చేశారు. ఈసందర్భంగా దాసన్నగారి కృష్ణమూర్తి ఈనెల 26న ఒంగోలులో మంత్రులు, సాహితీ దిగ్గజాల చేతుల మీదుగా అవార్డు అందుకోనున్నారు. కృష్ణమూర్తిని ప్రముఖ విమర్శకులు ఆచార్య రాచపాలెం చంద్రశేఖరరెడ్డి, డాక్టర్ పతికి రమేష్ నారాయణ, ఆచార్య బాలసుబ్రమణ్యం అభినందించారు.

భారత్ సంకల్ప యాత్రపై అవగాహన

ఆత్మకూరు: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మండల ప్రజాప్రతినిధులు, అధికారులకు వికసిత్ భారత్ సంకల్ప యాత్రపై ఎంపీడీఓ రఘునాథ్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ పథకాలకు సంబంధించి అర్హత కలిగి ఉండి, పథకాలు లబ్ధి పొందిన వివరాలను సేకరించాలన్నారు. డిసెంబర్ 24 నుంచి జనవరి 2 వరకు రోజుకు రెండు గ్రామ పంచాయతీల్లో ఓ వాహనం తిరుగుతుందన్నారు. వైస్ ఎంపీపీ విజయ్‌కుమార్ నాయక్, సర్పంచులు ఓబులేష్, ఎర్రిస్వామి, అధికారులు, సెక్రటరీలు పాల్గొన్నారు.

శ్రీకృష్ణదేవరాయ షోడశ మంటపం ప్రారంభం



షోడశ మంటపాన్ని ప్రారంభిస్తున్న వీసీ మాచిరెడ్డి రామకృష్ణా రెడ్డి దంపతులు

అనంతపురం: వర్సిటీలోని బొటానికల్ గార్డెన్‌లో శ్రీకృష్ణదేవరాయ షోడశ మంటపాన్ని వీసీ ప్రొఫెసర్ మాచిరెడ్డి రామకృష్ణా రెడ్డి దంపతులు శుక్రవారం ప్రారంభించారు. 2010 బ్యాచ్ అసిస్టెంట్ ప్రొఫెసర్లు రూ.20 లక్షల విరాళంతో షోడశ మంటపాన్ని నిర్మించి, వర్సిటీకి అప్పగించారు. బొటానికల్ గార్డెన్‌లో సేద తీరడానికి వీలుగా ఈ మంటపాన్ని నిర్మించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఏ. కృష్ణకుమారి, ఎస్టేట్ ఆఫీసర్ ప్రొఫెసర్ బి. రవి ప్రసాదరావు, 2010 బ్యాచ్ అసిస్టెంట్ ప్రొఫెసర్లు డాక్టర్ సత్యనారాయణ, డాక్టర్ కే అనిత, డాక్టర్ వి. మాధవి, డాక్టర్ మద్దిలేటి, డాక్టర్ చంద్రమౌళి రెడ్డి, డాక్టర్ ఎం. శ్రీరాములు, డాక్టర్ తిమ్మప్ప, డాక్టర్ శంకర్ రెడ్డి, డాక్టర్ దేవరాజు, డాక్టర్ నరేంద్ర మద్దు, డాక్టర్ అనూరాధ, ప్రొఫెసర్ వి.రఘునాథ రెడ్డి, ఆంటియా మాజీ వర్కింగ్ ప్రెసిడెంట్ టి. పురుషోత్తం రెడ్డి, బోధనేతర సంఘం కార్యదర్శి శాంతలింగం, మాజీ ఉపాధ్యక్షుడు నాగభూషణం పాల్గొన్నారు.

జగన్‌తోనే అన్ని వర్గాలకూ న్యాయం

- ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి



జగనన్న వారధిపై ర్యాలీగా వస్తున్న ఎమ్మెల్యే అనంత, వైఎస్సార్‌సీపీ నాయకులు,కార్యకర్తలు



సంక్షేమ బోర్డును ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే అనంత

అనంతపురం రూరల్: రాజకీయాలకతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి లన్నారు. శుక్రవారం రాజీవ్‌కాలనీ పంచాయతీ పరిధిలో ' వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ అభివృద్ధి సంక్షేమమే తమ ప్రభుత్వ ధ్యేయమన్నారు. టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు చెప్పే అపద్ధపు హామీలను నమ్మేందుకు ప్రజలు సిద్ధంగా లేరన్నారు. 2024 ఎన్నికల్లో ప్రతిపక్ష పార్టీలకు బుద్ధి చెప్పి అన్ని వర్గాల ప్రజలకూ న్యాయం చేస్తున్న వైఎస్సార్‌సీపీకి పట్టం కట్టి మరోసారి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిగా చేసుకోవడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. నగరానికి దీటుగా నియోజకవర్గ పరిధిలోని నాలుగు పంచాయతీలను అభివృద్ధి చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ ఆశాబీ, ఎంపీటీసీ సభ్యురాలు సంధ్య, వైఎస్సార్‌సీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు ఉమ్మడి మదన్‌మోహన్ రెడ్డి, జేసీఎస్ కన్వీనర్ ఆలమూరు శ్రీనివాసరెడ్డి, వైఎస్సార్‌సీపీ రూరల్ క్లస్టర్ కన్వీనర్ హుస్సేన్, నాయకులు అంజి, రహీమ్, దౌలా, పసలూరి ఓబిలేసు, మల్లెల వేణుగోపాల్ పాల్గొన్నారు.

చంద్రబాబు పాలనంతా మోసం

అనంతపురం కార్పొరేషన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ విప్లవాన్ని తీసుకొచ్చి, కులం ,మతం, పార్టీలు చూడకుండా, అవినీతికి ఆస్కారం లేకుండా అన్ని వర్గాలకూ సంక్షేమ పథకాలు అందించారని ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి తెలిపారు. 14 ఏళ్ల చంద్రబాబు పాలనంతా మోసపూరితమని, మరోనాలుగు నెలల్లోఎన్నికలు రానున్నాయని, ప్రజలు మేలు చేస్తున్న వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి అండగా నిలవాలని కోరారు. శుక్రవారం నాల్గో సచివాలయం (వేణుగోపాల్‌నగర్), 12 (రాణినగర్), 40 (నవోదయకాలనీ), 50 (మంగళవారి కాలనీ) సచివాలయాల పరిధిలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం జరిగింది. నవోదయకాలనీలోని 40వ సచివాలయ పరిధిలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని, అభివృద్ధి, సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరించారు. అనంతరం వైఎస్సార్‌సీపీ జెండా ఆవిష్కరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ నవోదయ కాలనీలోని 40వ సచివాలయ పరిధిలో రూ. 33,20,64,879 (రూ.33.20 కోట్లు) సంక్షేమ పథకాల రూపంలో అందించినట్లు తెలిపారు. గత టీడీపీ ప్రభుత్వంలో చంద్రబాబు డ్వాక్రా రుణాలు మాఫీ చేస్తామని మోసం చేశారన్నారు. ప్రతిపక్ష నేతగా ఉన్న సమయంలో జగనన్న ఇచ్చిన హామీల మేరకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఏర్పాటయ్యాక మూడు దశల్లో రూ.19 వేల కోట్లు రుణ మాఫీ చేశారన్నారు. ఇదే సచివాలయ పరిధిలో రూ.3,49,44,457 (రూ.3.49 కోట్లు) అభివృద్ధి పనులు జరిగాయన్నారు. ప్రధాన రోడ్లు, కాలువులు, అంతర్గత రోడ్లను ఏర్పాటు చేసిన విషయాన్ని గుర్తు చేశారు.

ప్రజలు ముందుచూపుతో ఆలోచించాలి..

సంక్షేమం, అభివృద్ధి కొనసాగాలంటే మరోమారు సీఎంగా వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి కొనసాగాలని ఎమ్మెల్యే అన్నారు. ప్రతి ఒక్కరూ ముందుచూపుతో ఆలోచించి, వైఎస్సార్‌సీపీకి అండగా నిలవాలన్నారు. కార్యక్రమంలో మేయర్ వసీం, డిప్యూటీ మేయర్లు కోగటం విజయభాస్కర్ రెడ్డి, వాసంతి సాహిత్య, మార్కెట్‌యార్డు చైర్మన్ ఫయాజ్, వైఎస్సార్ సీపీ నేత అనంత చంద్రారెడ్డి, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి కొంౖరెడ్డి ప్రకాష్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకుడు చింతా సోమశేఖర్‌రెడ్డి, మైనార్టీ విభాగం జిల్లా అధ్యక్షుడు సైపుల్లాబేగ్, కార్పొరేటర్లు సంపంగి రామాంజనేయులు, కొంౖరెడ్డి రాధ, సుజాత, ఇషాక్, క్లస్టర్ అధ్యక్షులు రమణారెడ్డి, ఓబిరెడ్డి, మధుసూదన్‌గౌడ్, జగదీష్, జేసీఎస్ కన్వీనర్లు చింతకుంట మధు, వీరా రామకృష్ణా రెడ్డి, లక్ష్మన్న, నాయకులు పోతులయ్య, సురేష్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నిష్పక్షపాతంగా పథకాల అమలు

- 'జగనన్న ప్రజా సంక్షేమ సదస్సు', 'వై ఏపీ నీడ్స్ జగన్'లో ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి



మన్నీలలో చిన్నారితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి



బొమ్మేపర్తిలో పథకాల డిస్‌ప్లే బోర్డును ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి

రాప్తాడురూరల్/కనగానపల్లి: దేశ చరిత్రలో సంక్షేమ పథకాలను నిష్పక్షపాతంగా అమలు చేస్తున్న ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం రాప్తాడు మండలం బొమ్మేపర్తి, అనంతపురం రూరల్ మండలం మన్నీల గ్రామాల్లో 'జగనన్న ప్రజా సంక్షేమ సదస్సు', 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా సచివాలయాల్లోని డిస్‌ప్లే బోర్డులను ఎమ్మెల్యే ఆవిష్కరించారు. మన్నీల కార్యక్రమంలో జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ పాల్గొన్నారు. అనంతరం ఏర్పాటు కేసిన కార్యక్రమాల్లో ఎమ్మెల్యే మాట్లాడుతూ సచివాలయాలు, వలంటీర్ల వ్యవస్థ ఏర్పాటుతో ప్రభుత్వాన్ని ప్రజల ఇళ్ల వద్దకు తీసుకొచ్చారన్నారు. మీ అందరి ఆశీస్సులతో ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత నియోజకవర్గ అభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేస్తున్నామన్నారు. ఎన్ని ఇబ్బందులు ఉన్నా ప్రజలు మా కుటుంబాన్ని ఆదరించారన్నారు. ప్రతిపక్ష టీడీపీ నాయకులు ఎక్కడో సందుల్లో రోడ్లు లేవని సెల్ఫీలు తీస్తున్నారని, రూ.4లక్షల రోడ్లు కాదు.. అదే సందుల్లో ఉండే ప్రజలందరికీ సంక్షేమ పథకాల ద్వారా రూ. 4 కోట్ల డబ్బులు వచ్చాయనేది గుర్తుంచుకోవాలన్నారు.

గతుకుల రోడ్లే కాదు.. ప్రజల బతుకులూ మారాయి..

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలో కొచ్చిన తర్వాత గతుకుల రోడ్లు కాదు.. ప్రజల బతుకులు మార్చామని ఎమ్మెల్యే అన్నారు. బాబు షూరిటీ.. భవిష్యత్తు గ్యారెంటీ అంటున్నారని, అదే బాబును జైలు నుంచి ష్యూరిటీ, జామీన్లు ఇచ్చి బయటకు తీసుకొచ్చారన్నారు. ఇప్పుడు మళ్లీ మోసం చేయరనే గ్యారంటీ ఉందా? అని ప్రశ్నించారు.

సునీత..భర్తపై ప్రమాణం చేయమనండి..

పరిటాల సునీత అక్రమాలకు పాల్పడలేదనేది తన భర్త మీద ప్రమాణం చేసి చెప్పమనండి. సంక్రాతి కానుకల్లో దోపిడీ చేయలేదని చెప్పమనండి.. ఈ ప్రాంతంలో దుర్మార్గంగా దోపిడీలు, హత్యలు చేయించలేదని చెప్పమనండి అని ఎమ్మెల్యే ప్రశ్నించారు. వాడెవడో ప్రపంచ యాత్రికుడు అన్వేష్ గాడు...సంక్షేమ పథకాలు ఇస్తే ఏపీ పూర్తిగా జింబాబ్వే లాగా మారిపోతుందంటున్నాడన్నారు. అలాంటివాడికి నారా లోకేష్ రూ. 5 కోట్లు గిఫ్ట్‌గా ఇస్తాడన్నారు. తండ్రి వైఎస్‌ఆర్ లాగా ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోవాలని వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి కోరుకుంటున్నారని తెలిపారు. గతంలో పథకాలు కావాలంటే సర్పంచులు, జన్మభూమి కమిటీ సభ్యుల వద్దకు వెళ్లాల్సిన పరిస్థితి ఉండేదన్నారు. పరిటాల సునీత ఇంటి వద్దకు వెళ్లి కాచుకోవాల్సి ఉండేదన్నారు. ప్రశాంతకు మారుపేరైన రాప్తాడు, అనంతపురం రూరల్, ఆత్మకూరు మండలాల్లో హత్యలు చేశారు.. అధికారాన్ని అడ్డు పెట్టుకొని దోపిడీ చేసింది పరిటాల కుటుంబమేనని అన్నారు. అందరి సంక్షేమం, అభివృద్ధి కోరుకుంటున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని మరోమారు ఆశీర్వదించాలని ఎమ్మెల్యే కోరారు. కార్యక్రమంలో ఎంపీపీలు చిట్రెడ్డి జయలక్ష్మి, వరలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యులు చంద్రకుమార్, మార్కెట్ యార్డ్ చైర్మన్ గోపాల్ రెడ్డి, మాజీ చైర్మన్ నాగేశ్వరరెడ్డి, వైస్ ఎంపీపీలు కృష్ణారెడ్డి, బోయ రామాంజనేయులు, మార్కెట్ యార్డ్ చైర్మన్ గోపాల్‌రెడ్డి, మాజీ చైర్మన్ నాగేశ్వరరెడ్డి, అనంతపురం రూరల్ మండల కన్వీనర్ దుగుమర్రి గోవిందరెడ్డి, రాప్తాడు మండల ఎన్నికల ఇన్‌చార్జ్ చిట్రెడ్డి సత్యనారాయణరెడ్డి, సర్పంచులు ఆనందరెడ్డి, ఆదినారాయణమ్మ, మాజీ సర్పంచ్ ఆదిశేషు తదితరులు పాల్గొన్నారు.

దోషులను కఠినంగా శిక్షించాలి



ర్యాలీ చేస్తున్న మేయర్ వసీం, ముస్లిం మైనార్టీలు

అనంతపురం కల్చరల్: బాలికపై హత్యాయత్నం చేసిన వారిని కఠినంగా శిక్షించాలని అఖిల పక్షం నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం ప్రత్యేక ప్రార్థనల అనంతరం వివిధ మసీదుల నుంచి ముస్లింలు, పలు రాజకీయ పార్టీల నాయకులు ర్యాలీగా వచ్చి, సప్తగిరి సర్కిల్‌లో మానవహారం ఏర్పాటు చేశారు. నగర మేయర్ వసీం, రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ నదీం, వక్ఫ్‌బోర్డు చైర్మన్ కాగజ్‌ఘర్ రిజ్వాన్, మైనార్టీ డైరెక్టర్ గౌస్‌బేగ్ తదితరులు మాట్లాడారు. బాలికను చిత్రహింసలు పెట్టిన ఏపీపీ వసంత లక్ష్మి, రమేష్ దంపతులను పోలీసులు అరెస్టు చేసి, రిమాండ్‌కు పంపాలన్నారు. బాలికకు న్యాయం జరిగే వరకూ పోరాటం చేస్తామన్నారు. ఈ అంశాన్ని ప్రభుత్వ పెద్దల దృష్టికి తీసుకెళ్లి సాధ్యమైన త్వరగా న్యాయం జరిగేలా చూస్తామన్నారు. అంతకు ముందు ఆస్పత్రిలో చికిత్సపొందుతున్న బాలికను పరామర్శించారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డు చైర్మన్ ఫయాజ్, మైనార్టీ జిల్లా అధ్యక్షుడు సైపుల్లా బేగ్, కార్పొరేటర్లు రహంతుల్లా, బాబా, ఇసాక్, వైఎస్సార్‌సీపీ నాయకులు మునీరా, ఖమర్‌తాజ్, ఖాజా, కృష్ణవేణి, తానీషా, రఫీ, నియాజ్, అఖిలపక్షం నాయకులు జాఫర్, మానవ హక్కుల సంఘం ప్రతినిధి రసూల్, ఎంఎండీ ఇమాం, ఐఎంఎం మహబూబ్ బాషా తదితరులు పాల్గొన్నారు.

కానిస్టేబుల్‌కు 'అమ్మ' కరుణ



పీసీ కుళ్లాయమ్మకు ఆర్థిక సాయం అందిస్తున్న తరిమెల రమణారెడ్డి

అనంతపురం కల్చరల్: నిరుపేదలు, అభాగ్యులు, నిరాశ్రయులు.. కష్టాల్లో ఉన్నారని తెలిసిన క్షణమే.. అక్కడి చేరుకొని మానవత్వం చూపే 'అమ్మ' సంస్థ అధ్యక్షుడు తరిమెల రమణారెడ్డి .. కిడ్నీ సమస్యతో బాధపడుతున్న ఓ కానిస్టేబుల్‌పై కరుణ చూపారు. నగరంలోని ఎస్సీ, ఎస్టీ సెల్‌లో పనిచేస్తున్న మహిళా కానిస్టేబుల్ కుళ్లాయమ్మ.. 2021 కరోనా విపత్కర పరిస్థితుల తర్వాత రెండు కిడ్నీలూ పాడయ్యాయి. నిస్సహాయ స్థితిలో ఉండగా ఆమె తల్లి ఒక కిడ్నీ దానం చేయడానికి ముందుకొచ్చింది. హైదరాబాద్ నిమ్స్ ఆస్పత్రిలో శస్త్రచికిత్స కోసం రూ.12 లక్షల దాకా ఖర్చవుతుందని వైద్యులు తెలిపారు. ఆర్థిక స్థోమత లేక అల్లాడుతున్న ఆమెను.. అమ్మ సంస్థ అధ్యక్షుడు రమణారెడ్డి రూ. 70 వేలు ఆర్థిక సాయం చేశారు. అనంతరం సర్కిల్ ఇన్‌స్పెక్టర్ విశ్వనాథచౌదరితో కలిసి ఆయన మాట్లాడుతూ దాతల సహకారంతో సాయమందిస్తామన్నారు.

పోలీసులు నిష్పక్షపాతంగా వ్యవహరించాలి



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం నాయకురాళ్లు

అనంతపురం కార్పొరేషన్: బాలికపై దాడి ఘటనలో పోలీసులు నిష్పక్షపాతంగా వ్యవహరించాలని, నిందితులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు శ్రీదేవి, నగర అధ్యక్షురాలు కృష్ణవేణి, మైనార్టీ విభాగం రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మునీరా కోరారు. శుక్రవారం జిల్లా పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. మహిళలకు రక్షణ కల్పించడంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ముందుందన్నారు. తెలంగాణాలో యువతిపై హత్యాచారం జరిగితే, ఏపీలో అలాంటి పరిస్థితి రాకూడదని సీఎం జగనన్న 'దిశ'ను ఏర్పాటు చేశారన్నారు. బాలికకు ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. టీడీపీ, జనసేన పార్టీలు బురదజల్లే ప్రయత్నం చేస్తున్నాయన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మహిళా నాయకులు కమర్తాజ్, శోభారాణి, అంజలి, అనిత, భారతి, ప్రసన్న పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు కృషి చేయాలి



సమీక్షిస్తున్న డీఆర్‌ఓ గాయత్రిదేవి

అనంతపురం అర్బన్: రోడ్డు ప్రమాదాల నివారణకు కృషి చేయలని డీఆర్‌ఓ గాయత్రిదేవి సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లా స్థాయి రహదారి భద్రత కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఆర్‌ఓ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలకు కారణాలపై వాహన చోదకులకు అవగాహన కల్పించాలన్నారు. నగర పరిధిలోని తపోవనం, బైపాస్, కళ్యాణదుర్గం రోడ్డు, తదితర ప్రధాన ప్రాంతాల్లో విద్యుత్ దీపాలు వెలిగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నగరంలో బస్సులు, ఇతర వాహనాలు తక్కువ వేగంతో వెళ్లేలా చర్యలు తీసుకోవాలన్నారు. అధికారులందరూ సమన్వయంతో పనిచేసి రోడ్డు ప్రమాదాల నివారణకు కృషి చేయాలన్నారు. రహదారి భద్రతకు తీసుకుంటున్న చర్యలపై రవాణా శాఖ ఉప కమిషనర్ వీర్రాజు వివరించారు. రహదారి భద్రత, చట్టాలపై విస్తృతస్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. నగరంలో 42 సీసీ కెమెరాలు ఏర్పాటుకు చర్యలు తీసుకున్నామన్నారు. హెల్మెట్ ధరించకుండా వాహనం నడపడం, డ్రంక్ అండ్ డ్రైవ్, తదితర తప్పిదాలపై కేసులు నమోదు చేస్తున్నామని చెప్పారు. జిల్లా వ్యాప్తంగా బ్లాక్‌స్పాట్‌లుగా గుర్తించి, 33 చోట్ల స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటుకు చర్యలు చేపట్టామన్నారు. సమావేశంలో ఏఎస్పీ విజయభాస్కర్‌రెడ్డి, ఎన్‌హెచ్‌ఏఐ పీడీ భూషణం భరత్, జీజీహెచ్ సూపరింటెండెంట్ వెంకటేశ్వరరావు, సీపీఓ అశోక్‌కుమార్‌రెడ్డి, పీఆర్ ఎస్‌ఈ భాగ్యరాజ్, ఆరోగ్యశ్రీ కోఆర్డినేటర్ కిరణ్‌కుమార్‌రెడ్డి, 108 అధికారి సంజీవరెడ్డి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

జగనన్నతోనే అన్ని వర్గాలకూ న్యాయం



ఆత్మకూరు సెంటర్‌లో వైఎస్సార్‌సీపీ జెండా ఆవిష్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

ఆత్మకూరు: ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డితోనే అన్ని వర్గాలకూ సమన్యాయం జరుగుతోందని, మళ్లీ సీఎంగా జగన్‌మోహన్‌రెడ్డిని గెలిపించుకుందాం అని మండల ప్రజా ప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు తెలిపారు. శుక్రవారం ఆత్మకూరు మండల కేంద్రంలో ' వై ఏపీ నీడ్స్ జగన్ ' కార్యక్రమం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆత్మకూరు-1 సచివాలయంలో ప్రభుత్వం సంక్షేమ పథకాల బోర్డును అధికారులు, ప్రజాప్రతినిధులు ఆవిష్కరించారు. ఆత్మకూరు-1 సచివాలయం ద్వారా రూ.40 కోట్ల మేరకు అభివృద్ధి పనులు జరిగాయని ప్రజాప్రతినిధులు తెలిపారు. అనంతరం వైఎస్సార్‌సీపీ ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పించారు. అనంతరం వైఎస్సార్‌సీపీ జెండాలతో ర్యాలీ చేశారు. ఆత్మకూరు సెంటర్‌లో వైఎస్సార్‌సీపీ జెండాను ఆవిష్కరించారు.

ఏ ప్రభుత్వంలో ఇంత లబ్ధి పొందలేదన్నా..

వైఎస్సార్‌సీపీ జెండా ఆవిష్కరణ అనంతరం ప్రభుత్వ పథకాల బుక్‌లెట్‌ను తీసుకెళ్లి పథకాలపై ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ప్రతి ఇంటివద్దా పథకాల గురించి విశేష స్పందన లభించింది. ఏ ప్రభుత్వంలో ఇలా పార్టీలకతీతంగా పథకాలు పొందలేదన్నా.. అని లబ్ధిదారులు ఆనందంగా తెలియజేశారు. కార్యక్రమంలో జిల్లా అధికార ప్రతనిధి చంద్రశేఖర్‌రెడ్డి, ఎంపీపీ హేమలత, రాష్ట్ర కురుబ సంఘ డైరెక్టర్ పార్వతమ్మ, బీసీ సెల్ నియోజకవర్గ అధ్యక్షులు బాలపోతన్న, జేసీఎస్ ఇన్‌చార్జ్ నరసింహారెడ్డి, ఎలక్షన్ ఇన్‌చార్జ్ గోపాల్‌రెడ్డి, కన్వీనర్ లక్ష్మీనరసింహులు, యూత్ కన్వీనర్ కొండారెడ్డి, వైస్ ఎంపీపీ విజయ్‌కుమార్, ఉప సర్పంచ్ తైదుల శివారెడ్డి, సర్పంచ్‌లు లక్ష్మీనారాయణరెడ్డి, ఓబులేష్, ఎర్రిస్వామి, వైఎస్సార్‌సీపీ నాయకులు ఈశ్వరరెడ్డి, ఫణిరెడ్డి, నాగరాజు, అతిక్ రెడ్డి, మల్లన్న, వెంకట్రాముడు, సుబ్బారెడ్డి, హనుమతునాయక్, లక్ష్మీనారాయరెడ్డి, కృష్ణానాయక్, పోతన్న, మాదన్న, వెంకటేష్, రామాంజి, చెన్నారెడ్డి, పెద్ద కొండారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులకు చిత్రలేఖన పోటీలు



చిన్నారులకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించిన దృశ్యం

అనంతపురం కల్చరల్: స్థానిక పీస్ మెమోరియల్ హాలులో జిల్లా పురావస్తు , టూరిజం శాఖలు, ఇంటాక్ సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో ప్రపంచ వారసత్వ వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం చిన్నారులకు చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. లేపాక్షి నంది, పెనుకొండ కోటలు, తాడిపత్రి దేవాలయాలు, జిల్లా కేంద్రంలోని గడియార స్తంభం తదితర చిత్రాలు ఆకట్టుకున్నాయి. జిల్లా మ్యూజియంలో నిర్వహించిన అవగాహన సదస్సులో టూరిజం శాఖ అధికారి నాగేశ్వరరెడ్డి, పురావస్తు శాఖ సహాయ సంచాలకులు రజిత మాట్లాడారు. న్యాయనిర్ణేతగా వ్యవహరించిన సీనియర్ చిత్రకారుడు ఎల్‌ఆర్ వెంకటరమణ, ఇంటాక్ ప్రతినిధులు రాంకుమార్, నబీరసూల్, గిరిధరరాయ్, సూర్యనారాయణరెడ్డి, రియాజుద్దీన్, సాధుశేఖర్, పడితల కృష్ణమూర్తి ఆత్మీయ అతిథులుగా మాట్లాడారు.

సంక్షిప్త సమాచారం

రైతులకు పరిహారమిచ్చి ఆదుకోండి

అనంతపురం అర్బన్: వర్షాభావంతో పంటలు నష్టపోయిన రైతులకు ప్రభుత్వం పరిహారం ఇచ్చి ఆదుకోవాలని సీపీఐ నాయకులు కోరారు. శుక్రవారం కలెక్టరేట్ ఎదుట నాయకులు బైఠాయించి, నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యదర్శి జాఫర్, సహాయ కార్యదర్శి నారాయణస్వామి, రైతు సంఘం జిల్లా కార్యదర్శి చిన్నప్పయాదవ్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కేశవరెడ్డి మాట్లాడారు. అనంతరం డీఆర్‌ఓ గాయత్రిదేవికి వినతిపత్రం అందించారు. నాయకులు మల్లికార్జున, రాజేశ్‌గౌడ్, అల్లీపీరా, నాగప్ప పాల్గొన్నారు.

క్రీడాకారులకు అభినందన

అనంతపురం రూరల్: ఇటీవల ఏలూరులో జరిగిన జూనియర్ బాలికల హ్యాండ్ బాల్ పోటీల్లో ప్రతిభ కనబరిచిన శారద, జాతీయ జట్టుకు ఎంపికైన అనంతపురం జట్టు క్రీడాకారులను ముక్కోటి అంబికా సేవా చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ దంపెట్ల శివ శుక్రవారం అభినందించారు.

నాణ్యత ప్రమాణాలు పాటించాలి

అనంతపురం కార్పొరేషన్: అభివృద్ధి పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని ఈఈ సూర్యనారాయణ తెలిపారు. శుక్రవారం నగరంలోని 32వ డివిజన్ సెవెన్‌హిల్స్ కాలనీలో జరుగుతున్న కాలువ నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. పనుల నాణ్యతలో రాజీపడకూడదన్నారు. పనులు జరిగే సమయంలో ఏఈ, వర్క్ ఇన్‌స్పెక్టర్ అందుబాటులో ఉండాలన్నారు. సెవెన్ హిల్స్ కాలనీలో సాధారణ నిధులు రూ.18.5 లక్షలతో రోడ్లు, కాలువలు నిర్మిస్తున్నట్లు తెలిపారు. డీఈ సుభాష్‌చంద్రబోస్, ఏఈ శంకర్, తదితరులు పాల్గొన్నారు.

చదువుతో పాటు క్రీడల్లో రాణించాలి

అనంతపురం రూరల్: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని పీవీకేకే కళాశాల చైర్మన్ పల్లె కృష్ణకిశోర్ అన్నారు. ఇటీవల కడపలో జరిగిన వాలీబాల్ పోటీల్లో ప్రతిభ కనబరిచి, సౌత్ జోన్ పోటీలకు ఎంపికైన అంకితను పీవీకేకే కళాశాల యాజమాన్యం, సిబ్బంది శుక్రవారం అభినందించారు. కళాశాల చైర్మన్ పల్లె కృష్ణకిశోర్ మాట్లాడుతూ విద్యార్థులు, చదవుతో పాటు క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ రమేష్‌బాబు, కోశాధికారి పల్లె సింధూరరెడ్డి పాల్గొన్నారు.

ఎస్కేయూ ఫైనాన్స్ ఆఫీసర్‌గా వెంకట్రాముడు

అనంతపురం: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం ఫైనాన్స్ ఆఫీసర్‌గా వి. వెంకట్రాముడు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేశారు. టీటీడీ వేదిక్ యూనివర్సిటీ నుంచి ఎస్కేయూకు ఫైనాన్స్ ఆఫీసర్‌గా బదిలీ చేశారు. వర్సిటీ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని పేర్కొన్నారు.

సాయి వైష్ణవికి డాక్టరేట్

అనంతపురం: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలోని బయో టెక్నాలజీ విభాగంలో పరిశోధన చేసిన జి. సాయి వైష్ణవికి శుక్రవారం డాక్టరేట్ ప్రదానం చేశారు. డాక్టర్ డి. మురళీధర్ రావు పర్యవేక్షణలో ' బయో టెక్నాలజికల్ ప్రొడక్షన్ ఆఫ్ ఎథిలైన్ గ్లైకాల్ బై కాల్డిసెల్యూసిర్‌ప్టర్ సాచిరోలైటికస్ ' అనే అంశంపై పరిశోధన చేశారు. ఈ అంశంపై పలు జాతీయ, అంతర్జాతీయ జర్నల్స్ ప్రచురించారు.

కోటి దీపోత్సవాలకు ఏర్పాట్లు

అనంతపురం కల్చరల్: నగరంలోని ఆర్‌ఎఫ్‌రోడ్డు లక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయం ఆధ్వర్యంలో ఆదివారం జరగనున్న కోటి దీపోత్సవానికి ఏర్పాట్లు చేస్తున్నట్లు కమిటీ అధ్యక్షుడు రమణారెడ్డి తెలిపారు. స్థానిక కొత్తూరు జూనియర్ కాలేజీలో సాయంత్రం 6.30 గంటలకు కోటి దీపోత్సవాన్ని కలెక్టర్ గౌతమి ప్రారంభిస్తారని తెలిపారు. నగరంలో మొదటి సారి 1,008 మంది దంపతులతో కోటి దీపోత్సవం జరుగుతుందన్నారు.

15 క్వింటాళ్ల బియ్యం స్వాధీనం

అనంతపురం క్రైం: అక్రమంగా నిల్వ ఉంచిన 15 క్వింటాళ్ల చౌక బియ్యాన్ని విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. స్థానిక బళ్లారి బైపాస్ ఎంజీ షోరూం సమీపంలోని ఓ షెడ్డులో బియ్యం నిల్వ ఉంచినట్లు గుర్తించి, సీజ్ చేశారు. ఇతర రాష్ట్రాలకు బియ్యాన్ని అక్రమంగా తరలించే ముఠా ఇక్కడ దాచి ఉండొచ్చన్న అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. తనిఖీలో సీఐ రామారావు పాల్గొన్నారు.

చైతన్య విద్యార్థులతో 'సేఫ్ ఆన్ రోడ్'

అనంతపురం ఎడ్యుకేషన్: స్థానిక హౌసింగ్ బోర్డు కాలనీలోని శ్రీ చైతన్య రెసిడెన్షియల్ బాలికల పాఠశాల, పాములరాయి రెసిడెన్షియల్ క్యాంపస్ విద్యార్థులు ఆర్టీఓ కార్యాలయ ప్రాంగణంలో 'సేఫ్ ఆన్ రోడ్' కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఏజీఎం సుబ్బారెడ్డి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ముఖ్యఅతిథులు డీటీసీ వీరరాజు, ఆర్టీవో సురేష్ నాయుడు, ఎంవీఐ సునీత మాట్లాడుతూ రోడ్డు ప్రయాణం – భద్రతపై చిన్నారులకు అవగాహన కల్పించారు. సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ వాహనాలు నడపరాదన్నారు. ట్రాఫిక్ నియమాలను పాటించాలన్నారు. అతివేగం వల్ల జరిగే అనర్థాలను వివరించారు. కార్యక్రమంలో శ్రీ చైతన్య పాఠశాలల ప్రిన్సిపాళ్లు సమీనా ఖాన్, ఇర్షాద్, అకడమిక్ కోఆర్డినేటర్లు రాధాకృష్ణ, నాగభూషణం, వైస్ ప్రిన్సిపాల్ షమీనా, డీన్ సత్యనారాయణ పాల్గొన్నారు.